# ట్రాఫిక్ సిబ్బంది భద్రత, సంక్షేమానికి పెద్దపీట



ట్రాఫిక్ సిబ్బందికి ఏసీ హెల్మెట్‌ను ధరింపజేస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

నాగోలు, న్యూస్‌టుడే: ఎండల తీవ్రత నుంచి రక్షించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ విధులు నిర్వర్తించాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. గురువారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ సిబ్బంది కోసం రూ.5లక్షల విలువైన 71,250 ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రూ.8 వేల ఖరీదుతో ప్రత్యేకించి తయారైన 5 ఏసీ హెల్మెట్లను ట్రాఫిక్ సిబ్బందికి అందజేశారు. వీటి పనితీరును అనుసరించి మిగతా వారికి అందించేలా చూస్తామన్నారు. ఈ నెల 14న అధికారులతో నిర్వహించిన సమావేశంలో ట్రాఫిక్ సిబ్బంది కోసం భద్రతా పరికరాల సేకరణ, వసతుల కల్పన విషయమై ప్రత్యేక చొరవ చూపాలని నిర్ణయించామన్నారు. రూ.3.2 కోట్ల విలువైన స్పీడ్ లేజర్ గన్‌లు, డిజిటల్ కెమెరాలు, ట్రాఫిక్ సేఫ్టీ పరికరాలు, సేఫ్టీ హెల్మెట్‌లు రెయిన్ కోట్లు తదితర వంటివి సిబ్బందికి అందించేందుకు ఆదేశించామన్నారు. ట్రాఫిక్ సిబ్బంది భద్రత, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. సరైన నంబరు ప్లేట్లు లేని, నకిలీ నంబర్లతో తిరిగే వాహన యజమానులపై కఠినచర్యలు తీసుకోనున్నట్లు సీపీ హెచ్చరించారు. జాయింట్ సీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు హరికృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఎండల నుంచి ఆరోగ్యం జాగ్రత్త

## ట్రాఫిక్ సిబ్బందికి ఏసీ హెల్మెట్లు పంపిణీ చేసిన రాచకొండ సీపీ చౌహాన్




సమావేశంలో మాట్లాడుతున్న సీపీ చౌహాన్

సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) :వేసవిలో ఎండల తీవ్రత నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ ట్రాఫిక్ సిబ్బందికి సూచించారు. సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా వేసవిలో సిబ్బంది డీహైడ్రేషన్‌ను అధిగమించేందుకు రూ.5 లక్షల విలువైన 71,250 ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐదుగురు సిబ్బందికి ఏసీ హెల్మెట్లను గురువారం పంపిణీ చేశారు. ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ చౌహాన్ మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయవద్దని సూచించారు. ట్రాఫిక్ సిబ్బందికి మౌలిక వసతుల కల్పనలో భాగంగా రూ.3.2 కోట్లతో స్పీడ్ లేజర్ గన్, డిజిటల్ కెమెరాలు, ట్రాఫిక్ సేఫ్టీ పరికరాలు, బారికేడ్లు, కోన్‌లు, బొల్లార్డ్స్, అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాలు, కిట్ బ్యాగ్‌లు, సేఫ్టీ హెల్మెట్‌లు, మాస్క్‌లు, రేడియం జాకెట్లు, సన్ గ్లాస్‌లు, గ్లౌవ్స్‌లు, వాటర్ బాటిల్స్, జంగిల్ షూస్, రెయిన్ కోట్స్ తదితర వస్తువులను అందజేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ వి.సత్యనారాయణ, ట్రాఫిక్ డీసీపీ డి.శ్రీనివాస్, ఎల్బీనగర్, ఉప్పల్ ట్రాఫిక్ ఏసీపీలు హరికృష్ణ, ఎస్.శ్రీనివాస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఏసీ హెల్మెట్!

- ట్రాఫిక్ సిబ్బందికి అధునాతన కిట్ల అందజేత

సాక్షి, సిటీబ్యూరో: రోజురోజుకూ ఎండ మండి పోతోంది. మండుటెండల్లో ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై విధులు నిర్వర్తించడమంటే ఆషామాషీ వ్యవహారం కాదు. వడగాలి, ఉక్కపోత శరీరం వేడెక్కిపోతుంది. దీని నుంచి ఉపశమనం కలిగించేందుకు రాచకొండ పోలీసు కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ సరికొత్త నిర్ణయం తీసు కున్నారు. ట్రాఫిక్ సిబ్బందికి ఏసీ హెల్మెట్లు అందించాలని నిర్ణయించారు. ఈ మేరకు గురువారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంప్ ఆఫీసులో ట్రాఫిక్ సిబ్బందికి ఏసీ హెల్మెట్లను అందించారు. ప్రయోగాత్మకంగా అయిదు హెల్మెట్లను మాత్రమే ఆర్డర్ ఇచ్చామని.. వాటి పని తీరును విశ్లేషించిన తర్వాత రాచకొండ ట్రాఫిక్ సిబ్బంది మొత్తానికి అందిస్తామని సీపీ తెలిపారు. బ్యాటరీ సహాయంతో పనిచేసే ఈ ఏసీ హెల్మెట్‌ను ఒక్కసారి చార్జింగ్ చేస్తే 8 గంటలు పనిచేస్తుంది. రూ.3.2 కోట్ల విలువ చేసే అత్యాధునిక ఉపకరణాలను కూడా ట్రాఫిక్ సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వేసవిలో ఎండ తీవ్రత నుంచి రక్షించుకునేలా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ట్రాఫిక్–2 డీసీపీ డి. శ్రీనివాస్, ఏసీపీలు ఎస్‌పీ. హరికృష్ణ, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

